సాక్షి రంగారెడ్డి

ఆదివారం ׀ 2 ׀ జూన్ ׀ 2024

న్యూస్‌రీల్

ముంపు ప్రాంతాల్లో ముందస్తు ప్రణాళికలు

- ఇరిగేషన్, మున్సిపల్ శాఖల సమన్వయం తప్పనిసరి
- కలెక్టర్ శశాంక



ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశమైన కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రానున్న వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. శనివారం ఆయన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లో ఎన్నికుటుంబాలకు ప్రమాదం పొంచిఉందో అంచనా వేసి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నివాస ప్రాంతాల్లో, రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు ఇరిగేషన్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ముంపు ప్రాంతాలను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. నాలాల్లో చెత్త లేకుండా శుభ్రం చేయించాలన్నారు. కాలనీల్లో పర్యటించి వర్షాకాలంలో వారు ఎదుర్కొనే సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. ఎస్ఎన్‌డీపీ, ఎస్ఆర్‌డీపీ పనులు జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు తప్పక ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు కలుషితమవకుండా చర్యలు ప్రారంభించాలన్నారు. ఎమర్జెన్సీ టీంలో ఇరిగేషన్ శాఖ వారిని భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల సిబ్బంది రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రభుదాస్



హుడాకాంప్లెక్స్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సిబ్బంది సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం శనివారం సరూర్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వడ్డేపల్లి ప్రభుదాస్, కార్యదర్శిగా పి.సుధాకర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత



యూనిఫాంలను పరిశీలిస్తున్న శ్రీలత

మంచాల: మహిళలు అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత అన్నారు. శనివారం ఆమె మండల కేంద్రంలోని మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం కుడుతున్న యూనిఫాంలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కొలతలు పాటిస్తూ యూనిఫాంలను సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిభ ఆధారంగా మరిన్ని అవకాశాలు అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శోభ, సీసీ జైపాల్‌రెడ్డి, వీఓఏలు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలకు 14 రోజుల రిమాండ్

కుషాయిగూడ: భూ వివాదంలో రూ. మూడు లక్షలు లంచం తీసుకుంటు అవినీతి నిరోధక శాఖాధికారులకు పట్టుబడ్డ కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ వీరస్వామి, ఎస్‌ఐ షేక్ షఫీ, మధ్యవర్తి ఎల్. ఉపేందర్‌కు 14 రోజుల రిమాండు విధిస్తూ నాంపల్లి ఏసీబీ కోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు శనివారం వారిని చంచల్‌గూడ జైల్‌కు తరలించినట్లు రంగారెడ్డి జోన్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఇది ఇలా ఉండగా ఎస్‌ఐ షఫీతో పాటుగా మరికొంత మంది పోలీసు అధికారుల బాధితులు చాలా మంది నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

హైరైజ్ భవనాలు

ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాలకు మొదటి నుంచి జిల్లా పెట్టింది పేరు. తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత అభివృద్ధి నిలిచిపోతుందని పుకార్లు లేపారు. అందుకు భిన్నంగా అభివృద్ధిలో మరింత దూసుకెళ్లింది. 50 నుంచి 59 అంతస్తుల వరకు భవనాలు వచ్చాయి. పుప్పాల్‌గూడలో క్యాండ్యూర్ స్కైలేన్(59), శ్రేయాస్ డైమండ్ టవర్స్(55), హైదరాబాద్ బై మై స్కేప్(52), శ్రేయాస్ డైమండ్ టవర్స్(48)వంటి హైరైజ్ బిల్డింగ్స్ వెలిశాయి. కోకాపేటలో ఎస్ఎస్ క్రౌన్(58), ది ట్రిలైట్-157, ది ట్రెలెట్-(57), మైహోం 99(54), పాలోమి ప్లాజో(54)లతో నిర్మించారు.





వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్



పదేళ్ల ప్రగతి.. అభినవ ఖ్యాతి!

పరిపాలన, అభివృద్ధిలో అందలం

- ఐటీతో అంతర్జాతీయ గుర్తింపు
- రియాల్టీతో సిరులు
- స్వరాష్ట్రంలో మారిన రూపురేఖలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణ మలిదశ ఉద్యమానికి జిల్లా ఊపిరిలూదింది. 2009 నవంబర్ 29న ఎల్బీనగర్ చౌరస్తాలో శ్రీకాంతాచారి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మబలిదానం చేసుకుని ఉద్యమానికి కాగడయ్యాడు. పోలీసుల నిర్బంధానికి నిరసనగా 2010 ఫిబ్రవరి 20న సిరిపురం యాదయ్య ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు వద్ద నిప్పంటించుకుని ఉద్యమపోరుకు బాటలేశాడు. ఎందరో జిల్లా వాసులు జైలు గోడలు ముద్దాడారు. విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, కర్షక పోరాటాల ఫలితంగా నాటి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు పచ్చా జెండా ఊపింది. 2014 జూన్ 2న ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి నేటితో పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జిల్లా సాధించిన ఖ్యాతిపై ప్రత్యేక కథనం.



చేవెళ్లలో ఆందోళన చేస్తున్న ఉద్యమకారులు (ఫైల్)

మూడు జిల్లాలు.. మూడు కార్పొరేషన్లు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మూడు ప్రాంతాలుగా విడిపోయింది. పరిపాలనలో వికేంద్రీకరణలో భాగంగా రంగారెడ్డిలో కొత్తగా వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలు ఆవిర్భవించాయి. కొంగరలో రంగారెడ్డి కలెక్టరేట్ భవనాన్ని ఏర్పాటు చేయగా, షామీర్‌పేట సమీపంలో మేడ్చల్ కలెక్టరేట్‌ను, వికారాబాద్ పట్టణంలో ఆ జిల్లా కలెక్టరేట్‌ను ఏర్పాటు చేసింది. శివారు గ్రామాలను మున్సిపాలిటీల్లో కలిపింది. కొత్తగా పెద్దఅంబర్‌పేట్, తుర్కయంజాల్, తుక్కుగూడ, జల్‌పల్లి, కొత్తూరు, శంషాబాద్, షాద్‌నగర్, శంకర్‌పల్లి, ఆదిభట్ల, ఆమనగల్లు, మణికొండ, నార్సింగి, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలను, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. అప్పటి వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఉన్న షాద్‌నగర్, కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గాల్లోని కొన్ని మండలాలను రంగారెడ్డి జిల్లా పరిధిలోకి తీసుకొచ్చి.. 27 మండలాలతో జిల్లాను ఏర్పాటు చేసింది.

మెట్రో పరుగులు

పదేళ్లలో ప్రజా రవాణాలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. అప్పటి వరకు ఆర్టీసీ బస్సులు, వ్యక్తిగత వాహనాలపైనే ఆధారపడిన జిల్లా వాసులకు మెట్రో రైలు అందుబాటులోకి వచ్చింది. ఎల్బీనగర్ నుంచి రాయదుర్గం వరకు కనెక్టివిటీ పెరిగింది. రాయదుర్గం నుంచి శంషాబాద్‌కు రూ.6,250 కోట్ల అంచనాతో మెట్రో రైలు విస్తరణ పనులు చేపట్టింది. గత ప్రభుత్వం పనులకు శంకుస్థాపన చేసింది. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అలైన్‌మెంట్‌ను మార్చింది. నాగోల్ నుంచి ఎల్బీనగర్, అటు నుంచి హయత్‌నగర్‌కు, ఎల్బీనగర్ నుంచి శంషాబాద్ వరకు మెట్రోను విస్తరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శంషాబాద్ టు కందుకూరు, షాద్‌నగర్ వరకు మెట్రో సేవలను విస్తరించాలనే ప్రతి పాదన సైతం తెరపైకి వచ్చింది.

మహేశ్వరంలో మెడికల్ కాలేజీ

2014కు ముందు జిల్లా వాసులు పూర్తిగా నగరంపైనే ఆధారపడాల్సి వచ్చేది. ప్రైవేటు ఇంటర్, డిగ్రీ, పీజీ కాలేజీల్లో రాజధానిలోనే చదువుకోవాల్సి వచ్చేది. ప్రాథమిక విద్యకు సైతం ఎంతో దూరం ప్రయాణించాల్సి వచ్చేది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, 10 కేజీబీవీ స్కూళ్లు అందుబాటులోకి వచ్చాయి. 213 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, రెసిడెన్షియల్ కాలేజీలు, 64 ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఏర్పడ్డాయి. ఇక మహేశ్వరంలో పాలిటెక్నిక్ కాలేజీ సహా న్యాయ, మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి.



మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న నేతలు హరీశ్‌రావు, సబితారెడ్డి



చలో హైదరాబాద్ ధర్నాకు తరలుతున్న నాయకులు (ఫైల్)



రైలు రోకోలో కిషన్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కోదండరామ్

ఫ్లై ఓవర్లు.. సిగ్నల్ ఫ్రీ రోడ్లు..

ఎల్బీనగర్ నుంచి దండుమల్కాపూర్ వరకు 25 కిలోమీటర్ల మేర విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65) విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకు రూ.545 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నాలుగు లేన్లుగా ఉన్న ఈ రోడ్డు.. ప్రస్తుతం ఆరు లేన్లుగా విస్తరించే పనులు ప్రారంభించింది. ఇక హైదరాబాద్ టు బీజాపూర్ జాతీయ రహదారి నాలుగు లేన్లుగా విస్తరించేందుకు రూ.928.41 కోట్లు మంజూరయ్యాయి. ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు మధ్యన ఉన్న మున్సిపాలిటీల పరిధిలో రోడ్ల అనుసంధానం పెద్ద ఎత్తున చేపట్టింది. శంషాబాద్ పట్టణంలో ఫ్లై ఓవర్‌తో పాటు మెహిదీపట్నం నుంచి నార్సింగి మీదుగా రెండు భారీ ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ నిర్మాణాలతో సైబరాబాద్ పరిధిలోని గచ్చిబౌలి, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, కోకాపేట, గండిపేట రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి.



విస్తరించిన పారిశ్రామిక ప్రగతి

కాటేదాన్, మంఖాల్, ఆదిభట్ల, ఫ్యాబ్‌సిటీ, నాదర్‌గుల్, హయత్‌నగర్, ఆటోనగర్ పారిశ్రామిక వాడలు మాత్రమే ఉన్నాయి. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత కొత్తగా 4,995 ఎకరాల విస్తీర్ణంలో చందనవెల్లి, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, కొత్తూరు ఇండస్ట్రియల్, సిద్దాపూర్, ఎలిమినేడు హార్డ్‌వేర్ పార్కులతో పాటు 19,333.20 ఎకరాల్లో యాచారం ఫార్మాసిటీ ప్రతిపాదించింది. ఇప్పటికే భూ సేకరణ చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మాసిటీ భూముల్లో టౌన్‌షిప్‌లను ఏర్పాటు ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చింది. అంతేకాదు హైటెక్‌సిటీ పరిసరాలకే పరిమితమైన ఐటీ సంస్థలు.. ఆ తర్వాత జిల్లా నలుమూలలకు విస్తరించాయి. షాబాద్‌లో వెల్‌స్పన్, మీర్‌ఖాన్‌పేటలో అమెజాన్ అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ భారీగా పెట్టుబడులు పెట్టడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. కొంగరలో ఫాక్స్‌కాన్, కేన్స్ సంస్థ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలు 16,058 వరకు ఉన్నాయి.

ఈ సంబురం.. అమరుల త్యాగఫలం

మొయినాబాద్: ఉద్యమానికి ఊపిరులూది.. తమ ఊపిరి తీసుకున్న త్యాగధనులు వారు.. తమ కుటుంబాల్లో చీకట్లు నిండినా సరే తెలంగాణ గడ్డపై వెలుగు రేఖలు నింపిన చిరు దివ్వెలు వారు.. పోరాట కెరటాలై.. తెలంగాణ సాధనకు ఆరాటపడిన ఆణిముత్యాలు ఆ అమరులు. ఆరు దశాబ్దాల ఉద్యమ కాలంలో ఎందరో విద్యార్థులు, యువతీయువకులు తమ ప్రాణాలను అర్పించారు. ఆత్మబలిదానాలతో ఉద్యమ యజ్ఞంలో సమిధలయ్యారు. వారి త్యాగాలు.. పోరాట బలంతో పదేళ్ల క్రితం తెలంగాణ స్వరాష్ట్రం సాకారమయింది. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తైన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. ఈ నాటి సంబురాలకు కారణమైన ఆనాటి అమరవీరులను స్మరించుకుంటూ వారికి జోహార్లర్పిద్దాం...



సరిత(ఫైల్)



మందడి యాదిరెడ్డి(ఫైల్)



జన్న మహేష్(ఫైల్)

ముగ్గురి బలవన్మరణం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో భాగంగా మొయినాబాద్ మండలానికి చెందిన ముగ్గురు ప్రాణత్యాగాలు చేసి ఉద్యమానికి ఊపిరయ్యారు. మండలానికి చెందిన ఇద్దరు యువకులు, ఓ యువతి రాష్ట్రం కోసం తమ ప్రాణాలను అర్పించారు. ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో అజీజ్‌నగర్‌కు చెందిన అరిగె నర్సింహ కూతురు అరిగె సరిత(18) 2010 ఫిబ్రవరి 22న తెలంగాణ రాష్ట్రం రాదనే మనస్థాపంతో ఉరివేసుకుని ఆత్మబలిదానం చేసింది. 2011 జులై 20న పెద్దమంగళారం గ్రామానికి చెందిన యువకుడు మందడి యాదిరెడ్డి(28) ఢిల్లీలో పార్లమెంటు ఎదుట ఉరేసుకున్నాడు. తెలంగాణ ప్రకటన వచ్చిన తరువాత పార్లమెంటులో తెలంగాణ బిల్లును సీమాంధ్ర ఎంపీలు అడ్డుకుంటున్నారని మనస్థాపం చెంది 2014 ఫిబ్రరి 1న చాకలిగూడలో జన్న మహేష్(32) ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఢిల్లీని కదిలించిన యాదిరెడ్డి అమరత్వం

తెలంగాణ కోసం పార్లమెంటు ఎదుట ఆత్మబలిదానం చేసుకున్న యాదిరెడ్డి త్యాగమే ఢిల్లీ పెద్దలను కదిలించింది. ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ ప్రజలు ఎంతగా ఆకాంక్షిస్తున్నారో కేంద్ర ప్రభుత్వానికి తెలిసొచ్చింది. యాదిరెడ్డి మరణం తరువాత తెలంగాణ ఉద్యమం మరింత ఉధృతమయింది. సకలజనుల సమ్మెతో ప్రజలంతా ఉద్యమంలో పాల్గొని తెలంగాణ ఆకాంక్షను చాటారు. అదే సమయంలో కేంద్రంలోనూ తెలంగాణ విషయాన్ని తేల్చాలని అప్పటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయించుకుంది. అందరి సహకారంతో రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసి 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటును అప్పటి యూపీఏ ప్రకటించింది.


సమీక్ష సమావేశంలో రిటర్నింగ్ అధికారి శశాంక, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి తదితరులు

కౌంట్‌డౌన్

- ఎంపీ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- 4న చేవెళ్లలోని బీఎస్‌ఐటీలో కౌంటింగ్
- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు 25 టేబుళ్లు, రెండు రౌండ్లు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: లోక్‌సభ తుది విడత ఎన్నికలు శనివారంతో ముగిశాయి. మంగళవారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. చేవెళ్ల మండలం గొల్లపల్లి శివారులోని బండారి శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో(బీఎస్ఐటీ) ఈ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగనుంది. ఏ, బి–బ్లాక్‌లలో గ్రౌండ్ ఫ్లోర్ సహా ఒకటి, రెండు, మూడో అంతస్తుల్లోని విశాలమైన హాల్స్‌లో ఈ లెక్కింపు ప్రక్రియ నిర్వహించనున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 2,877 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లను లెక్కించనున్నారు. ఇందుకు మొత్తం 165 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఈ ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో మొత్తం 777 మంది సిబ్బంది పాల్గొననున్నారు. వీరిలో కౌంటింగ్ సూపర్ వైజర్స్ 227 మంది ఉండగా, కౌంటింగ్ అసిస్టెంట్స్ 273, మైక్రో అబ్జర్వర్లు 277 మంది ఉన్నారు. ఇప్పటికే వీరికి శిక్షణ ఇచ్చారు. వీరంతా జూన్ 4న ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోనున్నారు. ఎనిమిది గంటలకు లెక్కింపు ప్రక్రియను ప్రారంభించనున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్(19,290) ఓట్లు లెక్కించనున్నారు. ఇందుకోసం 25 టేబుళ్లు ఏర్పాటు చేశారు. రెండు రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ గడువు సమీపిస్తుండటంతో అభ్యర్థులతో పాటు ఆయా పార్టీ కార్యకర్తల్లో టెన్షన్ మొదలైంది. ఓటింగ్ తర్వాత విదేశాలు, విహార యాత్రలకు వెళ్లిన అభ్యర్థులతో పాటు పోలింగ్ ఏజెంట్లు ఇప్పటికే సొంత గడ్డకు చేరుకున్నారు.

మూడంచెల భద్రత

లోక్ సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక చెప్పారు. ఈ మేరకు ఆయన చేవెళ్ల మండలం గొల్లపల్లిలోని బీఎస్ఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్‌లోని కంట్రోల్ రూంలో రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక, వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతిలతో కలిసి కౌంటింగ్ నిర్వహణపై సంబంధిత ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 4న ఓట్ల లెక్కింపు ఉంటుందని.. కేంద్రంలోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మంగళవారం ఉ.5.30 నుంచి ఆరు గంటల్లోగా అబ్జర్వర్ సమక్షంలో ర్యాండమైజేషన్ చేసి టేబుల్స్ కేటాయిస్తారని వివరించారు. ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఓట్ల లెక్కింపునకు మహేశ్వ రం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి 28 టేబుళ్లు, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరులకు సంబంధించి 14 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అబ్జర్వర్ సమక్షంలో ఐదు వీవీ ప్యాట్స్ రాండమ్ గా ఎంపిక చేసి స్లిప్పులను లెక్కిస్తారన్నారు. ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సిబ్బందిని, ఇతర సిబ్బందిని నియమించామన్నారు. ప్రతీ రౌండ్ పూర్తవగానే ఎంకోర్ యాప్‌లో డాటా నమోదు చేస్తామని.. కేంద్రం వద్ద అఫీషియల్ కమ్యూనికేషన్ రూమ్, మీడియా సెంటర్, పబ్లిక్ కమ్యూనికేషన్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టామని ఆర్ఓ వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఏఆర్ఓలు, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారి సైదులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన టేబుల్స్, రౌండ్లు

నియోజకవర్గం	కౌటింగ్ సెంటర్	పోలింగ్ కేంద్రాలు	టేబుళ్లు	రౌండ్లు	సిబ్బంది
మహేశ్వరం	బ్లాక్ బి, 1వ అంతస్తు	537	28	20	87
రాజేంద్రనగర్	బ్లాక్ ఎ, 2వ అంతస్తు	543	28	20	87
శేరిలింగంపల్లి	బ్లాక్ బి, గ్రౌండ్ ఫ్లోర్	633	28	23	87
చేవెళ్ల	బ్లాక్ ఎ, 1వ అంతస్తు	298	14	22	45
పరిగి	బ్లాక్ బి, 2వ అంతస్తు	305	14	22	45
వికారాబాద్	బ్లాక్ బి, 2వ అంతస్తు	284	14	21	45
తాండూరు	బ్లాక్ బి,3వ అంతస్తు	277	14	20	45
పోస్టల్ బ్యాలెట్	బ్లాక్ ఎ, 1వ అంతస్తు	–	25	2	78

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి


బాలమణి (ఫైల్)

మీర్‌పేట: ట్రావెల్స్ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోవిందస్వామి కథనం ప్రకారం. లెనిన్‌నగర్ భాగ్యకళానగర్‌కు చెందిన క్లాం బాలమణి (65) మిథానిలో గార్డెనింగ్ పనులు చేస్తుంది. ఉదయం మందుల కోసమని బడంగ్‌పేటలోని అపోలో మెడికల్ షాప్‌కు బయలుదేరింది. హెచ్‌పీ పెట్రోల్‌బంక్ వద్దకు రాగానే రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన పెద్దబావి ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఆమె ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి బస్సు డ్రైవర్ లోక్యాపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రేమ జంటకు పెళ్లి


పెళ్లి చేసుకున్న ప్రేమజంట

కొందుర్గు: ఓ ప్రేమ జంటకు గ్రామపెద్దలు పెళ్లి చేశారు. కొందుర్గు మండలం శ్రీరంగాపూర్‌కు చెందిన పత్తి నరేష్(21), అదే గ్రామానికి చెందిన బేబి(19) గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే, నాలుగు రోజుల క్రితం ఇద్దరు ఇంట్లో చెప్పకుండా గ్రామం నుంచి వెళ్లిపోయారు. శుక్రవారం కొందుర్గు పోలీసులను ఆశ్రయించారు. శనివారం గ్రామపెద్దలు కొందుర్గు లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రేమ జంటకు పెళ్లి జరిపించారు.

మహిళ అదృశ్యం


మమత

మాడ్గుల: మండలంలోని ఓ మహిళ అదృశ్యమైన ఘటన నల్లవారిపల్లిలో చోటు చేసుకుంది. సీఐ విష్ణువర్ధన్ రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం.. నల్లవారిపల్లికి చెందిన మేడల మమత గత నెల 4న ఇద్దరు పిల్లలను వదిలి, ఒక పాపను తన వెంట తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం లభించలేదు.. ఆమె భర్త మేడల దశరథ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

హుండీ పగులగొట్టి నగదు చోరీ


హుండీని పగులగొట్టిన దుండగులు

మొయినాబాద్: ఆలయంలోని హుండీ పగులగొట్టి అందులోని నగదును గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారు. ఈ ఘటన మండలంలోని సురంగల్ కట్టమైసమ్మ దేవాలయంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం సురంగల్ గ్రామ సమీపంలో ఉన్న కట్టమైసమ్మ దేవాలయాన్ని గతేడాది పునఃనిర్మాణం చేపట్టారు. ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని దుండగులు కట్టకిందికి తీసుకెళ్లి అందులోని నగదును దోచుకున్నారు. శనివారం ఉదయం అటువైపు వెళ్లిన గ్రామస్తులు ఆలయంలో హుండీ లేదని గమనించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ఉప ఎన్నిక ఫలితంపై ఉత్కంఠ

- గెలుపుపై అభ్యర్థుల ధీమా
- నేడే మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు


ఓటేసినట్లు చూపుతున్న ఎంపీటీసీ సభ్యులు (ఫైల్)

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. మార్చిలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన వెంటనే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయింది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను ఈసీ జూన్ 2కి వాయిదా వేసింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఐదు టేబుళ్లపై లెక్కింపు

మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ఆయన పదవికి రాజీనామా చేశారు. ఖాళీ ఏర్పడిన ఈ స్థానానికి మార్చిన 28న ఉప ఎన్నిక జరిగింది. బీఆర్ఎస్ నుంచి నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్ తలపడ్డారు. ఈ ఎన్నికలో ఎక్స్ అఫిషియో సభ్యులు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మొత్తం 19 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ పరిధిలో మొత్తం 83 మంది జెడ్పీటీసీ సభ్యులులు, 449 మంది కౌన్సిలర్లు , 886 మంది ఎంపీటీసీ సభ్యులు ఓట్లు వేశారు. మొత్తం 1,439 మంది ఓటర్లు ఉండగా 1,437 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఐదు టేబుళ్ల పై ఈ ఓట్లను లెక్కించనున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో ఎవరైనా అభ్యర్థి గెలిస్తే మధ్యాహ్నం లోపు ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. లేదంటే సాయంత్రం వరకు కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనుంది.

లెక్కింపు ఇలా

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక టేబుల్‌లో 237 ఓట్ల లెక్కింపు ఉంటుంది. మొత్తం 10 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను లెక్కిస్తారు. వీటిలో చెల్లని ఓట్లు, చెల్లిన ఓట్లను వేరు చేస్తారు. తర్వాత మొదటి ప్రాధాన్యతన ఓట్లు లెక్కించి పోలైన ఓట్లలో సగాని కంటే ఎక్కువగా వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. లేదంటే రెండవ ప్రాధాన్యత ఓట్లు లెక్కించి సగానికంటే ఎక్కువగా వచ్చిన వారిని విజేతగా ప్రకటిస్తారు.

తీవ్ర ఉత్కంఠ

ఎమ్మెల్సీ ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఆ పార్టీల అభ్యర్థులు ఓటర్లను గోవా, కర్ణాటక తదితర ప్రాంతాల్లో క్యాంప్‌నకు తరలించారు. వారిని ఆకట్టుకునేందుకు అభ్యర్థులు ఎన్నోపాట్లు పడ్డారు. దీంతో ఆ రెండు పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన జిలెటిన్‌స్టిక్స్ స్వాధీనం

- 490 మందుగుండు పట్టుకున్న పోలీసులు
- నిందితులను రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రంగస్వామి


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్‌రూరల్: ప్రమాదకరమైన జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ రంగస్వామి పేర్కొన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఏసీపీ రంగస్వామి వివరాలు వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గ్రామానికి చెందిన నర్సింహ్మ, పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీకి చెందిన ఈశ్వర్, రాజు, రమేష్‌లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 490 జిలెటిన్ స్టిక్స్‌ను ఇంట్లో నిల్వ ఉంచారు. విశ్వసనీయ సమాచారం మేరకు శంషాబాద్ ఎస్ఓటీ, షాద్‌నగర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు కంప్రెషన్ ట్రాక్టర్, వైర్ కట్టర్, నాలుగు సెల్‌ఫోన్లు, టెస్టర్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.8.75లక్షలు ఉంటుందన్నారు. అనుమతులు లేకుండా ప్రమాదకరమైన జిలెటిన్‌స్టిక్స్‌ను అక్రమంగా ఇళ్లలో నిల్వ ఉంచడం నిషేధమన్నారు. నిందితులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసు వ్యవహారంలో బిల్డింగ్ బ్లాక్స్ వెంచర్ యజమాని మధుసూదన్‌రెడ్డి , ఐడియల్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోలిజివ్ పరిశ్రమ మేనేజర్ నరేందర్‌రెడ్డి, సతీష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టణసీఐ ప్రతాప్‌లింగం, ఎస్ఓటీ సీఐ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్ఐలు శరత్‌కుమార్, శ్రీకాంత్, తరుణ్, సిబ్బంది సత్యనారాయణ, జాన్సన్, రాజశేఖర్, వెంకటరమణ, వంశీకృష్ణ, రవికుమార్, రాధాకృష్ణ పాల్గొన్నారు.